

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

# సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

## -జిల్లా కలెక్టర్ మను చౌదరి



సిద్ధిపేట మున్సిపాలిటీలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ మను చౌదరి

**సిద్ధిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:**

ఏ ఒక్కరు కూడా మిస్ కాకుండా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి సర్వే ఎన్యూమరేటర్లను ఆదేశించారు. శనివారం ప్రారంభమైన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను సిద్దిపేట మున్సిపాలిటీలోని 33వ వార్డులో పర్యటించి పరిశీలించారు. సర్వేలో భాగంగా 6 నుంచి 8 వరకు ఇంటింటికి స్టిక్కరింగ్ వేయడం పూర్తి చేసినట్లు తెలిపారు. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన ఫారంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ,ఉపాధి, రాజకీయ, కుల వివరాలను ప్రతి కుటుంబం నుంచి సేకరించి నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎలాంటి పొరపాట్లు చేయకుండా జాగ్రత్తగా వివరాలను పొందుపర్చాలన్నారు. సర్వేతో ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా రూపొందించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తదితర వివరాలను తమ వద్ద ఉంచుకొని సర్వే కోసం వచ్చే ఎన్యూమరేటర్లకు అందించి వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సదానందం, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

### సమగ్ర సర్వేకు ప్రజలు ముందుకు రావాలి : తహశీల్దార్

**మర్కుక్,నవంబరు9,ప్రభాతవార్త** : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని తహశీల్ధార్ హిరిపా అన్నారు.శనివారం రోజున మర్కుక్ మండల కేంద్రంలో సమగ్ర కుటుంబ సర్వేను ప్రారంభించారు.అనంతరం మాట్లాడుతూ శనివారం 126 కుటుంబాల సర్వే పూర్తి చేశామని మిగతా 6749 కుటుంబాలకు నేటి నుండి సర్వే కొనసాగుతుందన్నారు.నిర్వహిస్తున్న సర్వే అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపివో లింగం,కార్యదర్శి శాంతితో పాటు తదితరులు ఉన్నారు.

# అదుపు తప్పి కల్వర్టును ఢీ కొట్టిన కారు

## -తల్లీకూతుళ్ల మృతి

**బెజ్జంకి, నవంబరు 9, ప్రభాతవార్త** : కారు అదుపు తప్పి కల్వర్టును ఢీ కొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న తల్లి కూతురు ప్రాణాలు కోల్పోయిన సంఘటన శనివారం మండల పరిధిలోని బెజ్జంకి క్రాసింగ్ గ్రామంలో గల రాజీవ్ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదారాబాద్ నుంచి కరీంనగర్‌లోని స్వంతింటికి తన తమ్ముడితో కలిసి కారులో బయలు దేరిన వరలక్ష్మి కుటంబం మార్గమధ్యలో బెజ్జంకి క్రాసింగ్ వద్దకు రాగానే వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టడంతో తల్లి వరలక్ష్మి(42), కూతురు అద్వితీయ(13)లు తీవ్ర గాయాలవడంతో ప్రమాద స్థలంలోనే ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. తమ్ముడు విజయ్‌కుమార్‌కు తీవ్రగాయాలవగా కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. సంఘలన స్థలాన్ని సిద్దిపేట ఏసీపీ మధు, సీఐ శ్రీను సందర్శించారు.

# హరీష్‌రావును రాజకీయంగా బొందపెట్టే వరకు నిద్రపోను

**-హరీష్‌రావును అనుచరుల భూ బాగోతాలు, అవినీతి బయటపెట్టి ప్రజల ముందు ఉంచుతా**

**-కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు,రైతులకు అండ**

**-మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు**



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హన్మంతరావు

**సిద్దిపేట రూరల్, నవంబరు 9, ప్రభాతవార్త :**

సిద్దిపేటలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావును రాజకీయంగా బొందపెట్టే వరకు నిద్రపోనని మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైనంపల్లి హన్మంతరావు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్ నాయకులు గతంలో తెలంగాణ ఉద్యమ సమయంలో ఎంతో మందిని పొట్టనపెట్టుకున్నారని తిరిగి మళ్లీ అదే దారిలో నడుస్తున్నారని ఆరోపించారు. సిద్దిపేటలో ఓ దళిత నాయకుడు సిఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తే హరీష్‌రావు జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. హరీష్‌రావు, కెటిఆర్‌తో పాటు పార్టీ నాయకులు ఇంకా అధికారంలో ఉన్నట్లే పగటి కలలు కంటున్నారని తెలిపారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నంత కాలం కల్వకుంట కటుంబం మొత్తం రాష్ట్రాన్ని దోచుకతిని 7 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. నా ప్రాణం ఉన్నంత వరకు కల్వకుంట కుటుంబాన్ని వదిలి పెట్టానన్నారు. సిద్దిపేటలో నేను వెళ్తుంటే బిఆర్ఎస్ నాయకులు ఎందుకు నినాదాలు చేశారని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పాలనలో ఐఏఎస్,ఐపిఎస్ అధికారులను తొత్తులుగా మార్చారు కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారులకు విలువ ఆస్తున్నామన్నారు. సిద్దిపేటలో క్రికెట్ అడుతుండడం తప్పిదారి కిందపడిపోతే బిఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో ఎందుకు రాద్దాంతం చేస్తున్నారని మండిపడ్డారు. బిఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయిన తర్వాత జీర్ణించుకోలేకపోతున్నారని అధికారంలో ఉన్నట్లే పగటి కలలు కంటున్నా రని మండిపడ్డారు. హరీష్‌రావు అనుచరుల అవినీతి భూ బాగోతాలు బయటపెట్టి ప్రజల ముందు ఉంచుతానని తెలిపారు. బి ఆర్ఎస్ అధికారంలో ఉన్నంత కాలం కల్వకుంట కుటుంబ మొత్తం దోచకతిని 7 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. కల్వకుంట కుటుంబ ఆరాచకాలు అన్ని బయటకు తీసే దాకా వదిలే ప్రసక్తి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం పేదలకు,రైతులకు అండగా ఉంటుందన్నారు.

సమావేశంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు), నాయకులు నరకుల్ల శివప్ప, శ్రీనివాస్‌గౌడ్, బొమ్మల యాదగిరి, గాడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, గయాజుద్దీన్, కలీం తదితరులు పాల్గొన్నారు.

# యజ్ఞంలా సాగుతున్న కుల గణన సర్వే

**-కుల గణనకు సంక్షేమ పథకాలకు సంబంధం లేదు**

**-సర్వేను పరోక్షంగా అడ్డుకోవడానికి బిజెపి, బిఆర్ఎస్ సైంధవుల్లా ప్రయత్నం**

**-బిజెపికి దమ్ముంటే దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలి**

**-బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్**



విలేకరులతో మాట్లాడుతున్న బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

కుల గణన సర్వే ఒక యజ్ఞంలా సాగుతుందని అన్ని పార్టీల నాయకులు సహకరించాలని..కుల గణనకు సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని సుప్రీం కోర్టు నిబంధనల మేరకు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల గణన సర్వేపై బిజెపి, బిఆర్ఎస్ తమ విధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కుల గణనను నిలిపి వేసేలా బిజెపి కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. బిసిలపై చిత్త శుద్ధి ఉంటే బిజెపి దేశ వ్యప్తంగా కుల గణన చేయాలని డిమాండ్ చేశారు. కుల గణనపై బిజెపి, బిఆర్ఎస్ నోరు విప్పడం లేదన్నారు. కిషన్‌రెడ్డి, కెసిఆర్ ఎందుకు స్పందించడం లేదని కుల గణన మీకు ఇష్టం ఉందా లేదా చెప్పాలని ప్రశ్నించారు. ఆ రెండు పార్టీలు కుల గణనను పరోక్షంగా అడ్డుకోవడానికి సైంధవల్లా ప్రయత్నం చేస్తున్నాయన్నారు. 1931లో బ్రిటిష్ ప్రభుత్వం కుల గణన చేసిందని నేడు స్వాతంత్రం వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కుల గణన చేపట్టిందన్నారు. బిసిలకు వ్యతిరేకంగా వ్యవహారించే పార్టీల నాయకుల భరతం పడుతామని హెచ్చరించారు. కుల గణనతో రాజ్యాంగ, చట్ట బద్దంగా బిసిలకు దక్కాల్సిన రిజర్వేషన్ల వాట దక్కుతుందన్నారు. బిసి కుల గణనతో యాశించే స్థాయి నుంచి శ్వాసించే స్థాయికి ఎదుగుతారని తెలిపారు. కుల గణన చేయకుండా బిసిలకు రిజర్వేషన్లు దక్కకుండా కుట్రలు చేస్తే సహించేది లేదన్నారు. కుల గణన సర్వేలో బిసిలు కులం తప్ప చెప్పొద్దని ఎలాంటి ప్రభుత్వ పథకాలు రద్దు కావాన్నారు. ప్రస్తుతం జరుగుతున్న కుల గణన చారిత్రాత్మకమైందని పెద్దయెత్తున ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. దశాబ్ధాలుగా చేసిన పోరాటాలతోనే ప్రభుత్వం కులగణన ప్రారంభించిందన్నారు. కుల గణన అగ్రవర్ణాలకు అవసరం లేదని కుల గణన బిసిల కోసమని తెలిపారు. కుల గణనలో బిసిలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అలంపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు పర్యటన చేపట్టడం జరిగిందన్నారు. సమావేశంలో బిసి సంక్షేమ సంఘం ప్రతినిధులు శ్రీనివాస్, విక్రమ్‌గౌడ్, నవీన్‌గౌడ్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో ధాన్యం దళారుల పాలైంది

**-మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే సునీతా రెడ్డి**



రైతు దీక్షలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్ రావు

**కొల్చారం, నవంబర్ 9 ప్రభాతవార్త:**

కాంగ్రెస్ పాలనలో రైతు పండించిన ధాన్యం దళారుల పాలైందని, బీఆర్ఎస్ పోరాటంతోనే రుణమాఫీ జరిగిందని, కాంగ్రెస్ నేతలు అభివృద్ధిని గాలికి వదిలేసి గాలి మోటర్లలో తిరుగుతున్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా 100 సీట్లు గెలుస్తామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డిలు అన్నారు. శనివారం మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలోని బస్టాండ్ ఆవరణలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు దీక్షను చేపట్టారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీష్ రావు, సునీతా రెడ్డి, పద్మ దేవేందర్ రెడ్డిలు మాట్లాడుతూ ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో విధ్వంసం కొనసాగుతుందని, బీఆర్ఎస్ పాలనలో వికాసం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే ప్రభాకర్, మాణిక్ రావు, ఎమ్మెల్సీ శేరి శుభాష్ రెడ్డి, మాజీ జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు మన్సూర్, మాజీ గ్రంథాలయ చైర్మెన్ చంద్రాగౌడ్, శివ్వంపేట మాజీ జడ్పీటీసీ పబ్బా మహేష్ గుప్తా, మండల పార్టీ అధ్యక్షుడు గౌరీ శంకర్, యువత విభాగం అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్ రావు, యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి, ఎంపీపీ మంజుల, మాజీ జడ్పీటీసీ మేఘమాల సంతోష్, పార్టీ సీనియర్ నేతలు ముత్యం ప్రవీణ్ కుమార్, ఇంద్రసేన రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ పాశం శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, బాగారెడ్డి, యడాగౌడ్, సాయిని సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు.

# దళిత బంధు అడిగితే దౌర్జన్యంగా అరెస్టు చేస్తారా...!?

**-హుస్నాబాద్‌లో సైతం దళితబంధు లబ్ధిదారులకు డబ్బులు జమ చేయాలి**

**-హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్**



ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని పరామర్శిస్తున్న సతీష్‌కుమార్

**హుస్నాబాద్‌రూరల్,నవంబరు9,ప్రభాతవార్త**

హుజురాబాద్ నియోజకవర్గంలోని దళిత కుటుంబాల బిఆర్ఎస్ హయాంలో మంజూరైన దళిత బంధు రెండవ విడత లబ్ధిదారులకు నిధులు మంజూరు చేయాలని శాంతియుతంగా లబ్ధిదారులు నిరసన వ్యక్తం చేస్తుంటే వారికి మద్దతు తెలిపిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపన్ని దౌర్జన్యంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ అన్నారు.శనివారం రోజున కరీంనగర్‌లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కౌశిక్‌రెడ్డిని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలసి పరామర్శించారు.ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా పాలన నిర్వహిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పేద దళిత హక్కుల కోసం ప్రశ్నిస్తే దాడులు చేయిస్తారా అని ప్రశ్నించారు.ప్రజలకు ఉన్న హక్కులను ప్రభుత్వం నుండి తీసుకునే హక్కు ప్రజలకు ఉందని గుర్తు చేశారు.ఇచ్చిన హామీ అమలు చేయమంటే దాడులు చేయడం కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయడం పద్ధతి కాదన్నారు.ఈ విషయంలో ప్రభుత్వం తీరుమార్చుకోవడంతో పాటు హుస్నాబాద్ నియోజకవర్గంలో దళిత బంధు పథకం రెండవ విడత లబ్ధిదారులకు సైతం వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో దళిత బంధు పథకంలో 12లక్షలు అందజేస్తామని బాండు పేపర్లు రాసి దేవుళ్ళ ఆలయాల్లో చేసిన ప్రమాణాలు బూటకమేనా అని ప్రశ్నించారు.ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా అని దుయ్యబట్టారు.ఇచ్చిన హామీలు అమలు చేయని ప్రభుత్వం హక్కులు అడిగే వారిపై దాడులు,కేసులు పెట్టించడం మానుకోవాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.అక్రమంగా కేసులు పెట్టి అరెస్టు చేసిన బిఆర్ఎస్ నాయకులకు బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## -జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



స్పెషల్ క్యాంపింగ్ డేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 9 ప్రభాతవార్త:**

ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. శనివారం హవేలీ ఘనపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో స్పెషల్ క్యాంపింగ్ డేను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ (స్వీప్) ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం-2025 లో భాగంగా మెదక్ జిల్లావ్యాప్తంగా శనివారం, నేడు (ఆదివారం) నవంబర్ 10వ తేదీన ప్రత్యేక ఓటర్ నమోదు నిర్వహిస్తున్నామని తెలిపారు. జనవరి 1వ తేదీ 2025 నాటికి 18 సంవత్సరాలు నిండే యువత కొత్త ఓటర్‌గా నమోదు చేసుకునేందుకు, మార్పులు, సవరణలకు, వెలువడిన ఓటరు జాబితాలో అభ్యంతరాలు తెలిపేందుకు బూత్ లెవల్ ఆఫీసర్‌లు తమ బూత్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటారన్నారు. నూతన ఓటర్‌గా నమోదుకు ఫామ్-6, అక్టోబర్ 29న విడుదల చేసిన ఓటర్ ముసాయిదాలో అభ్యంతరాల కోసం ఫారం-7, సవరణలకు ఫారం-8 లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజలు ఆన్‌లైన్‌లో ఓటర్స్.ఈసిఐ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని కలెక్టర్ తెలిపారు.

### పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

**-రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ అరుణ శ్రీ**

**గుమ్మడిదల, నవంబర్ 9 ప్రభాతవార్త:**

గుమ్మడిదల మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో శనివారం రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ అరుణ శ్రీ ఆకస్మిక తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గుమ్మడిదల మండల కేంద్రంతో పాటు అన్నారం, జిన్నారం మండలంలోని వావిలాల, అమీన్‌పూర్, ఐలాపూర్ తాండాలలో తనిఖీలు నిర్వహించడం జరిగిందని గుమ్మడిదల మండల పశు వైద్యాధికారి అరుణ తెలిపారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ ఏడీ అరుణ శ్రీ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలను ప్రతి ఒక్క పాడి పశువుకు ఇవ్వాలని, టీకా శీతోష్ణ స్థితిని టీకా వేసిన పశువులకు చెవి ట్యాగ్ వేయడం, ఆ పశువు యొక్క వివరాలను (భారత్ పశు వధన్) యాప్‌లో నమోదు చేయాలని వాటి వివరాలను తెలుసుకుంటూ వివరించారు. గాలికుంటు వ్యాధి ప్రమాదకరమైన వైరస్‌తో వచ్చే వ్యాధి అని, ఈ వ్యాధి రైతులకు అపారమైన ఆర్థిక నష్టాన్ని కలిగిస్తుందన్నారు. ఈ వ్యాధి ద్వారా పశువులను కోల్పోవడం జరుగుతుందని, కాబట్టి రైతులందరూ తమ పశువులకు కచ్చితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని గాలికుంటు వ్యాధి రహిత రాష్ట్రంగా చేయడానికి ఈ మహోత్తరమైన కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా చేయాలని రైతులకు, అధికారులకు కోరారు. పశు సంవర్ధక శాఖ వైద్యాధికారుల ద్వారా టీకా వేసిన తర్వాత సిరం నమూనా అధ్యయనం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వసంతకుమారి, డాక్టర్ పవన్ కుమార్, వెటర్నరీ డాక్టర్ అరుణ, డాక్టర్ విశ్వ చైతన్య,డాక్టర్ ప్రవీణ్,పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### సంగారెడ్డిలో సర్వేను ప్రారంభించిన కలెక్టర్ క్రాంతి



రాంనగర్ కాలనీలో సమగ్ర కుటుంబ సర్వేను ప్రారంభిస్తున్న కలెక్టర్ వల్లూరు

**సంగారెడ్డి టౌన్, నవంబరు 9, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి మున్సిపల్ పరిధిలోని రాంనగర్ కాలనీలో 22 వార్డులో శనివారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర కుటుంబ సర్వే)ను ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, మండల ప్రత్యేక అధికారి ఖాసీం భేగ్, సంగారెడ్డి ఆర్డిఓ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ ప్రసాద్ చౌహాన్, ఎన్యూమరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటర్లకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు

## -మెదక్ ఆర్డీవో రమాదేవి



రామాయంపేటలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 9, ప్రభాతవార్త :**

త్వరలో జరగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు మెదక్ ఆర్‌డీవో రమాదేవి తెలిపారు. శనివారం నాడు ఆమె రామాయంపేట మున్సిపాలిటీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన 78, 80, 83, 88 ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. త్వరలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగుతున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు. అలాగే రెండు రోజుల పాటు పోలింగ్ కేంద్రాలో బిఎల్‌వోలు ప్రజలకు అందుబాటులో ఉంటారని, ఓటు హక్కు విషయంలో ఓటర్ల నమోదు లేదా అడ్రస్ మార్పు లాంటివి చేసుకోవాలనుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ ఓటు హక్కును మున్సిపాలిటీ పరిధిలోని ఏ వార్డుకైనా మార్చుకునే అవకాశం ఉందని, అందుకు సరైన పత్రాలు సమర్పించి, మార్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ రజిని, కళాశాల ప్రిన్సిపాల్ హిమజ్యోతి, బిఎల్ఓలు మర్కు లావణ్య, కవిత, రజిత, తరంగిణి, అంగన్‌వాడి టీచర్‌తో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే హరీష్ రావు

**కొల్చారం, నవంబర్ 9 ప్రభాతవార్త:**

కొల్చారం మండల పరిధిలోని చిన్నఘనపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని శనివారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని. రుణమాఫీ విషయంలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు మేనిఫెస్టోలో ఉన్న హామీలతో పాటు ఎక్కువ హామీలను నెరవేర్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావుకే దక్కిందన్నారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఇప్పటి వరకు కొనుగోలు చేపట్టకపోవడం హాస్యాస్పదంగా ఉందని, సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పటివరకు ఎక్కడ కూడా కొనుగోలు చేపట్టకపోవడం దురదృష్టకరమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా తయారైందని అన్నారు. ఈ సందర్భంగా విగ్రహ ధాతకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు. ఘనపూర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ముదిరాజ్‌ల జీవితాల్లో కాంగ్రెస్ వెలుగులు నింపుతోంది

**సిర్గాపూర్, నవంబరు 9, ప్రభాతవార్త:** ముదిరాజ్‌ల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టులోకి చేపపిల్లలను టిజి ఎఫ్‌సిడిఎఫ్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య లిమిటెడ్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ 100 శాతం రాయితీతో చేపపిల్లలను అందించడే కాకుండా చేపపిల్లలు పెరిగాక అమ్ముకునేందుకు వాహన సౌకర్యం సైతం చేస్తూ ముదిరాజుల కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గుండు వెంకటరాములు, మత్స్యకార సంఘం చీఫ్ ప్రమోటర్ గున్నల నర్సింలు, మత్స్యకార సంఘం బాధ్యులు, అధికారులు, నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు రాంరెడ్డి, బాల్‌రెడ్డి, జైరాజ్,కృష్ణా మూర్తి, శ్యామ్‌ప్రసాద్ ముదిరాజ్, విఠల్, నరేందర్, మధు, రవి పాటిల్, మాజీ సర్పంచ్ జ్ఞానేశ్వర్, మోహన్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, సాయిలు బండారి, దేవదాస్, పండరి, బుంగొండ, నారాయణ, మారుతి, వీరచారి,మహేశ్వర్ పాటిల్, ఉప్పరి విఠల్ తదితరులు పాల్గొన్నారు.

### ఆకతాయి వేదింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

**మర్కుక్,నవంబరు9,ప్రభాతవార్త**

ఓ ఆకతాయి వేదింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న విశాద సంఘటన మండల పరిధిలోని ఎర్రవల్లిలో చోటుచేసుకుంది.మృతురాలి తల్లితండ్రులు పోలీస్‌ల వివరాల ప్రకారం కామారెడ్డికి చెందిన కర్కె కిష్టవ్వ కిశిరాం దంపతుల కూతురు ప్రియాంకకు గత మూడేళ్ళ క్రితం ఎర్రవెల్లికి చెందిన ఇస్తారి రమేష్‌తో వివాహం జరిగిందని,దంపతులు ఇద్దరు వైవాహిక జీవితంలో సంతోషంగా ఉండేవారని వారికి ఇద్దరు కూతుళ్లు కూడా ఉన్నారని ఆనందంగా సాగుతున్న వారి జీవితంలో అదే గ్రామానికి చెందిన కుంట భాస్కర్ అనే ఆకతాయి తమ కూతురిని మానసికంగా వేదింపులకు గురి చేసేవాడని ఆకతాయి వేదింపులు తాళలేకనే శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది.మృతురాలి తల్లితండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యప్తు చేస్తున్నట్లు చెబుతున్నారు.ప్రియాంక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## దేశంలోనే అరుదైన ఘనత సాధించిన ప్రభుత్వ సిటీ కళాశాల

- విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ఆచార్య యాదగిరి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ఆచార్య జి.యాదగిరి

**చార్మినార్,నవంబరు 9 ప్రభాతవార్త :**
శత వసంతాల ప్రభుత్వ సిటీ కళాశాల నాక్ అక్రెడిటేషన్‌లో భారత దేశంలోనే అత్యున్నతమైన గ్రేడ్‌ను పొంది అరుదైన ఘనత సాధించిందని విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ఆచార్య జి.యాదగిరి అన్నారు. బెంగుళూరులో నాక్ విడుదల చేసిన ఫలితాలు ప్రకారం హైదరాబాద్ పాతబస్తీలో ఉన్న ప్రభుత్వ సిటీ కళాశాల 3.67 సిజిపిఎ సాధించి అరుదైన చరిత్ర సృష్టించిందని ఆయన కొనియాడారు. ప్రభుత్వ సిటి కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన సంబురాల కార్యక్రమంలో విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ఆచార్య జి.యాదగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ మార్గదర్శనంలో ఐక్యూఏసి సమన్వకర్త డాక్టర్. నీరజ్ కృషి, అధ్యాపక బృందం సమిష్టి ప్రయత్నం, బోధనేతర సిబ్బంది సహకారం, విద్యార్థుల క్రియాశీలకమైన భాగస్వామ్యం వల్ల సిటీ కళాశాల జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని సంయుక్త సంచాలకులు రాజేంద్రసింగ్ అన్నారు. విద్యా సంస్కరణలో సిటీ కళాశాల మార్గదర్శకమైన ప్రమాణాలు పాటించిందని విద్యాశాఖ అధికారులు ప్రశంసించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ మాట్లాడుతూ గత నాక్ బృందం ఇచ్చిన సూచనలన్నింటినీ సంపూర్ణంగా అమలు చేయటంతో పాటు కళాశాలకు స్వంత నిధులుతో కొత్త భవనాన్ని సమ కూర్చుకున్నామని తెలిపారు. కళాశాల అధ్యాపక బృందం అంతరాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన జర్నళ్లల్లో 400 పైగా పరిశోధన పత్రాలు ప్రచురించటం వల్ల ప్రభుత్వ సిటీ కళాశాల ఘన కీర్తి ప్రపంచానికి తెలిసిందని ఆయన తెలియజేశారు. కళాశాల విద్యాశాఖ కమీషనర్ దేవసేన ఈ అపూర్వ ఘనత సాధించిన సిటీ కళాశాల ప్రిన్సిపాల్‌ను అభినంధించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విప్లవ్‌దత్ శుక్లా, భవనం ఇంఛార్జి డాక్టర్ యాదయ్య, మాధవితో పాటు కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది ,విద్యార్థులు పాల్గొన్నారు.

## నార్మ్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ అనీజకు చాణక్య అవార్డు

**అత్తాపూర్ నవంబరు9,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్(నార్మ్)లో చీఫ్ టెక్నికల్ ఆఫీసర్( కమ్యూనికేషన్స్)గా ప్రజా సంబంధాల అధికారిగా పనిచేస్తున్న గుత్తికొండ అనీజ ప్రతిష్టాత్మకమైన చాణక్య అవార్డు ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పబ్లిక్ ఔట్రిచ్ 2024 ను అందుకున్నారు. పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుంచి పదవ తేదీ వరకు జరుగుతున్న 18వ గ్లోబల్ కమ్యూనికేషన్ కాంక్లేవ్ లో గుత్తికొండ అనీజ కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యశో నాయక్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. వ్యవసాయ విద్య, శిక్షణ కార్యక్రమాలలో పాల్గొంటున్న వారికి ఆ రంగంలో అవగాహన కల్పించడమే కాకుండా కమ్యూనికేషన్స్ స్కిల్స్ పెంపొందించడంలో గుత్తికొండ అనీజ చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డును అందజేశారు. ప్రజా సంబంధాల అధికారిణి గా ఆమె వ్యవసాయ పరిశోధనలు, శిక్షణ, విద్యా కార్యక్రమాలను ఆయా రంగాల ప్రజలకు చేరవేయడానికి చేస్తున్న కృషికి గాను ఈ అవార్డును ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గుత్తికొండ అనీజ మాట్లాడుతూ...తనకు జాతీయస్థాయిలో చాణక్య అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు . ఇది తనకు మరింత బాధ్యతను పెంచిందని గుర్తు చేశారు. తనకు విధి నిర్వహణలో ప్రోత్సాహాన్ని అందిస్తూ సహకరించిన నార్మ్ డైరెక్టర్ డా. సీహెచ్ శ్రీనివాస్ రావు, మాజీ డైరెక్టర్లు డాక్టర్ డి . రామారావు, డాక్టర్ ఆర్ కె సమంత, డాక్టర్ జగదీష్ సి కల్ల, డాక్టర్ ఎన్ హెచ్ రావు, డాక్టర్ ఎస్ ఎన్ సహా, డాక్టర్ జె సి కత్యాల్ తో పాటు సిబ్బంది అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## దళిత కార్మికురాలిని విధుల్లోంచి తొలగించడం అన్యాయం

**సైఫాబాద్, నవంబరు 9 ప్రభాతవార్త:**
మధ్యాహ్న భోజన పథకంలో దశాబ్ధకాలంగా పనిచేస్తున్న దళిత మహిళా కార్మికురాలు అకారణంగా తొలగించడం అవమానవీయమని, ఆమెతో తొలగించిన మరో ఇద్దరు దళిత మహిళలను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధ్యాహ్న భోజనం పథకం దళిత మహిళా కార్మికురాలు సువర్ణ, దళిత్ క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మోజోస్‌లతో కలిసి శ్రీకృష్ణ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా మంథని నియోజకవర్గం, కాటారం మండలం, ధన్వాడ గ్రామానికి చెందిన పసుల సువర్ణ ప్రభుత్వ స్కూల్‌లో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేస్తున్నదని చెప్పారు. రాజకీయ కక్షలతో రాష్ట్ర మంత్రి సోదరుడు శ్రీను ఆమెను అకారణంగా విధుల్లోంచి తొలగించడం జరిగిందని ఆయన ఆరోపించారు. ఆమెకు ప్రమాదం జరిగినప్పుడు అదుకున్న రాజకీయ నాయకుల పేర్లును చెప్పడం వల్ల ఆమెను విధుల్లోంచి తొలగించడం దారుణమన్నారు. పేద మహిళపై కక్షగట్టి దళిత మహిళా కార్మికురాలిని తొలగించడం అన్యాయమని, ఈ విషయంలో రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని తిరిగి వారిని విధుల్లోకి తీసుకోవాలని శ్రీకృష్ణ విజ్ఞప్తి చేశారు.

## ఓ.యూలో నిర్వహించిన సదస్సుకు హాజరైన జస్టిస్ నగేష్ భీమపాక్

**తార్నాక, నవంబర్ 9 ప్రభాతవార్త:**
ఉస్మానియా యూనివర్సిటీలో శనివవారం నిర్వహించిన సదస్సుకు జస్టిస్ నగేష్ భీమపాక్ ముఖ్య అతిథులుగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంత కాలేజ్, విశ్వభారత్ కాలేజ్ ఆఫ్ లా. ఉస్మానియా కాలేజ్ ఆఫ్ లా అనుసంధానంతో న్యూక్రిమినల్ లాస్ ఏన్ ఎరా ఆఫ్ ట్రాన్స్‌ఫామిషన్ ఆఫ్ క్రిమినల్ జస్టిస్ అనే అశంపై నిర్వహించిన రెండు రోజుల సెమినార్‌కు తెలంగాణ హైకోర్టు జడ్జి, తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి హాజరయ్యారు. అనంతరం వివిధ ప్రముకులు, విద్యావేత్తలు, న్యూక్రిమినల్ లాస్ అంశంపై రచించిన పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ నగేష్ భీమపాక మాట్లాడుతూ విద్యార్థులు ఆకాశమే హద్దుగా ఎదుగాలని సూచించారు. అనంతరం చైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యావంతులు సమాజానికి ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ డీన్ ప్రొ.డా. బి.విజయలక్ష్మి, అసోసియేట్ ప్రొ.డా.ఎన్.రామప్రసాద్, ప్రిన్సిపల్ ఓ.యూ కాలేజ్ ఆఫ్ లా డా.వి.రాధికాయాదవ్, సదస్సు కన్వీనర్ డా.ఎం. వి. చంద్రమతి, కరస్పాండెంట్ రవి అనంత పాల్గొన్నారు.

### రోగులకు మెరుగైన చికిత్సలు అందించడమే లక్ష్యం

మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలలో అత్యాధునిక అగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్) సాంకేతికతను వినియోగిస్తున్నామని, తద్వారా అధునాతన ఆర్థోపెడిక్ కేర్‌లో అగ్రగామిగా నిలిచినట్లుగా అరెటె హాస్పిటల్స్ ప్రకటించింది. రోగులకు మెరుగైన పనితీరు ఫలితాలు అందించడంతో పాటు రోగులను త్వరగా కోలుకునేలా చేస్తుందని వెల్లడించింది.

## నక్సలిజం పోవాలంటే దోపిడీ లేని సమాజం రావాలి

-ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ సూచన



సభలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

**సైఫాబాద్, నవంబరు 9 ప్రభాతవార్త:**
నక్సలిజం పోవాలంటే దోపిడీ, పీడన లేని సమాజం నిర్మాణం జరగాలని, అలాంటి సమాజ నిర్మాణం జరిగినప్పుడే భారత విప్లవ ఉద్యమ నేత, మార్క్సిస్ట్-లెనినిస్ట్ మేధావి చంద్ర పుల్లారెడ్డికి నిజమైన నివాళులు అర్పించినట్లని తెలంగాణ రాష్ట్ర పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ చెప్పారు. దేశంలో అకలి ఉన్నంత కాలం ఉద్యమాలు కొనసాగుతూనే ఉంటాయని, పుల్లారెడ్డి త్యాగాల వల్లనే దేశవ్యాప్తంగా విప్లవ ఉద్యమాలు విస్తరించాయని ఆయన తెలిపారు. సిపిఐ ఎంఎల్ (చంద్ర పుల్లారెడ్డి) పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన పుల్లారెడ్డి 40వ వర్ధంతి సభలో ఆయన ప్రసంగించారు. ఈ సభకు భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి చిట్టిబాబు అధ్యక్షత వహించారు. పుల్లారెడ్డి కలలు నిజం కావాలంటే దోపిడీ, పీడన లేని సమాజం రావాలన్నారు. పుల్లారెడి అశయాల సాధనకు వెళుతుంటే రాజ్యం కాల్చి చంపుతున్నదని, రాజ్యం సంపన్నులకే కొమ్ముకాస్తున్నదని, పేదల కోసం పాటుపడటం లేదని, ప్రశ్నిస్తే చంపుతున్నదని ఆరోపించారు. రాజకీయ విప్లవాన్ని రాజకీయంగా చూడాలని కాని రాజ్యం అలా చూడటం లేదని విమర్శించారు. దేశంలో ఎక్కడ చూసిన దోపిడీ కొనసాగుతున్నదని, భూస్వామ్య, పెట్టుబడిదారులకు పాలక వర్గాలు కొమ్ముకాస్తున్నాయని ఆయన ధ్వజమెత్తారు. ఈ సభలో ఐఎఫ్‌టియు (శ్రామిక స్పందన) జాతీయ కార్యదర్శి షేక్ షావలి, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.సుధాకర్, పివైఎల్ రాష్ట్ర కార్యదర్శి బాణోతు సంతోష్‌నాయక్ మాట్లాడుతూ సామ్రాజ్యవాదుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటానికి ముందుకు వచ్చే ప్రజలను, ప్రజా పోరాటాలను తీవ్ర నిర్బంధాలతో పాలకులు భయాందోళనలకు గురిచేస్తున్నారని, మతోన్మాదాన్ని మూఢ అంధ విశ్వాసాలను, సనాతన ధర్మాన్ని పెంచిపోషియస్తున్నారని ఆరోపించారు. ఆపరేషన్ కాగార్‌ను వెంటనే ఎత్తివేయాలని, గోదావరి లోయ రైతాంగ ప్రతిఘటన పోరాటాలు వర్ధిల్లాలని, మార్క్సిజం, లేనినిజం, మావో ఆలోచన విధానం కొనసాగాలని, వ్యవసాయ విప్లవం, నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలని, విప్లకారుల ఐక్యత కొనసాగాలని వారు పిలుపునిచ్చారు.

## న్యాయవిద్య, న్యాయవృత్తి చాలా ఉన్నతమైంది

-రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ బాలకిష్టారెడ్డి




ప్రసంగిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ వి.బాలకిష్టారెడ్డి

**చిక్కడపల్లి, నవంబరు 9 ప్రభాతవార్త:**
న్యాయవిద్య, న్యాయవృత్తి చాలా ఉన్నతమైందని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. శనివారం చిక్కడపల్లిలోని పెండేకంటి న్యాయకళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు రెండు రోజుల జాతీయ మూట్‌కోర్టు పోటీల ప్రారంభోత్సవ సభకు డాక్టర్ వి.బాలకిష్టారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి ప్రసంగించారు. విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కరోనా తర్వాత సమాజ స్థితగతులలో జరిగిన పరివర్తన, సాంకేతిక నైపుణ్యం వల్ల జరిగిన మారఉప్పుల వల్ల న్యాయవృత్తి, న్యాయవిద్యలో పరివర్తన వచ్చిందన్నారు. న్యాయవిద్య అంతర్జాతీయ స్థాయిలో వృత్తి అభివృద్ధి చెందిందన్నారు. సాంకేతికంగా అభివృద్ధి చెందడం వల్ల న్యాయవృత్తి, న్యాయవిద్య అభ్యాసం సునాయసమైందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయ విభాగం, బోర్డుఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ ఎస్.రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన కృషి వల్లే న్యాయవృత్తిలో ఉత్తీర్ణత పొందవచ్చున్నారు. బాధ్యతతో కూడిన విలువలను వృత్తిలో అవలంభించుకోవాలన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం సీనియర్ ప్రొఫెసర్, పాలమూరు, శాతవాహన విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వాసవీ విద్యాసంస్థల అధిపతి పి.రామ్మోహన్ రావు, కోశాధికారి ఎం.ఆనంద్, పెండేకంటి న్యాయకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అరవింద, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారుల పొట్టకొట్టవద్దు : ఎమ్మెల్యే తలసాని



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

**సంజీవరెడ్డి నగర్, నవంబర్ 9, ప్రభాతవార్త**
సుందరీకరణ, అభివృద్ధి పేరుతో చిరు వ్యాపారుల పొట్ట కొట్టవద్దని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి అమీర్‌పేటలోని హనుమాన్ టెంపుల్, కనకదుర్గమ్మ టెంపుల్ ప్రాంతాలలో పర్యటించి స్థానిక వ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు చేపట్టే అభివృద్ధి పనులతో తాము ఇబ్బందులకు గురవుతున్నామని మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను తన కార్యాలయంలో కలిసి విన్నవించుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే జోనల్ కమీషనర్‌తో మాట్లాడారు. ఎన్నో సంవత్సరాల నుండి చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని, రోడ్ల అభివృద్ధి, సుందరీకరణ పేరుతో తాము వ్యాపారాలు చేసుకోకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఆందోళన చెందవద్దని మీకు అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు. సుమారు 70 సంవత్సరాలకు పైగా అమీర్‌పేట సర్కిల్ నుండి హనుమాన్ దేవాలయం, కనకదుర్గమ్మ దేవాలయం, గురుద్వార్, మైత్రివనం తదితర ప్రాంతాలలో తోపుడు బండ్లు, ఫుట్‌పాత్‌లపై వివిధ రకాల వ్యాపారాలు చేసుకుంటూ వేలాదిమంది జీవనం సాగిస్తున్నారని అన్నారు. అభివృద్ధి పనులు చేపడతాం, సుందరీకరణ చేస్తామంటే వారు ఎక్కడికిపోవాలి, వారి కుటుంబాలు ఏమైపోవాలని ప్రశ్నించారు. వారికి ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు. అసలే ఇరుకుగా ఉన్న ఈ ప్రాంతాలలో ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టవలసిన అవసరం ఏముందని అన్నారు. వ్యాపారాలు సరిగాలేక వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మరింత ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. స్థానికంగా ఉన్న వ్యాపారులు, అసోసియేషన్ల ప్రతినిధుల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యాపారులు, ప్రజలకు ఇబ్బందులు కలగని రీతిలో ఫుట్‌పాత్‌లను నిర్మించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, జిహెచ్‌ఎంసి ఈఈ వెంకటనారాయణ, వాటర్‌వర్క్స్ జిఎం హరిశంకర్, డిజిఎం వంశీ, ఎలక్ట్రికల్ ఏడి సుధాకర్, స్ట్రీట్ లైట్ ఏఈ శ్రీనివాస్, లా అండ్ ఆర్డర్ ఎస్ఐ శ్రవణ్, ట్రాఫిక్ ఎస్ఐలు కాంతారావు, రాంబాబు, మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు గుర్మిత్ సింగ్, ఉత్తమకుమార్ పురోహిత్, డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు సంతోష్, అశోక్‌యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, కూతురు నర్సింహ, పియూష్‌గుప్తా, గుడిగే శ్రీనివాస్ యాదవ్, సుమిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రిల్ హౌస్ షవర్మ సెంటర్ సీజ్

**అల్వాల్ నవంబరు 9,ప్రభాతవార్త**
ఆహార విక్రయాలపేరుతో అపారోగ్యాన్ని పంచుతున్న లోతుకుంట లోని ఓ షవర్మా సెంటర్ ను జీహెచ్‌ఎంసీ అధికారులు శనివారం సీజ్ చేసారు. వివరాలిలా ఉన్నాయి. అల్వాల్ లోతుకుంట ప్రధాన రోడ్డుపక్కనే ఉన్న గ్రిల్‌హౌస్ షవర్మ విక్రయ కేంద్రంలో షవర్మా కొనుగోలు చేసిన ఆరుగురు శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో విషయం తెల్సుకున్న జీహెచ్ ఎంసీ ఆహార భద్రత అధికారి లక్ష్మీకాంత్ శనివారం గ్రిల్ హౌజ్ ను సీజ్ చేసారు. గతంలో కూడా రెండు సార్లు ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడంతో జీహెచ్‌ఎంసీ ఆహార భద్రత అధికారులు విషయాన్ని సీరియస్ గా తీసుకున్నారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ ఆహార భద్రత అధికారి లక్ష్మీకాంత్ మాట్లాడుతూ హోటల్స్, చిరు వ్యాపారులు ఆహార నాణ్యత విస్మరించి వినియోగదారులు అనారోగ్యానికి గురయ్యేలా చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే వెంటనే ఆయా సెంటర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇక నుంచి తరచూ తమ పరిధిలోని హోటల్స్‌తో పాటు ఇలాంటి సెంటర్లపై తనిఖీలు నిర్వహించి శాంపిల్స్ సేకరిస్తామని ఆయన హెచ్చరించారు.




లోతుకుంట లో జీహెచ్‌ఎంసీ అధికారులు సీజ్ చేసిన గ్రిల్ హౌస్ షవర్మ సెంటర్.

## కేంద్రం దేశవ్యాప్తంగా జనగణనలో కులగణన చేపట్టాలి

బి.సి.యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు పాలూరు రామకృష్ణయ్య




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న రామకృష్ణయ్య తదితరులు

**హైదరాబాద్, నవంబర్ 9,ప్రభాతవార్త:**
కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేసి బిసి రిజర్వేషన్లను పెంచాలని బిసి యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు పాలూరు రామకృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కులగణన చేపట్టినందుకు సిఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్‌లకు బి.సి.ల తరుపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఇప్పటికైన బిజెపి పార్టీ ప్రధాని నరేంద్రమోడీ బిసి అని డబ్బా కొట్టడం మాని కేంద్రములో కూడా 2025 జనగణనతో పాటు కులగణనను చేపట్టాలన్నారు. అందుకు ఓ.బి.సి సెల్ జాతీయ అధ్యక్షుడు ఎంపి డా.లక్ష్మణ్ కేంద్ర నాయకత్వం సానుకూలంగా నిర్ణయం తీసికొనేందుకు తన వంతు ప్రయత్నం చేయాలని లేనిపక్షంలో బిజెపి నుండి బయటకు రావాలని డిమాండ్ చేశారు. అలానే బిహార్ సిఎం నితీశ్ కుమార్, ఏపి సిఎం చంద్రబాబునాయుడు తమ వంతుగా కులగణన కోసం గట్టి ప్రయత్నము చేయాలని కోరారు. అలా చేయలేని పక్షములో కేంద్రప్రభుత్వానికి తమ మద్దతు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రెడ్డిగాండ్ల కులం బిసికులం కాదు.. రెడ్డి గాండ్ల బి.సి. కులం కాదని, వారు రెడ్లు అంటే కాపు కులానికి చెందిన వారని రామకృష్ణయ్య అన్నారు. నాటి రోశయ్య ప్రభుత్వము, రెడ్డి గాండ్లను బిసి (బి) క్రమ సంఖ్య 6 లో నున్న గాండ్ల, తెలకుల, దేవతెలికులతో కలిపివారికి కూడా బి.సి బి సర్టిఫికెట్ ఇవ్వాలని ఆర్డర్ తెచ్చారన్నారు. ఆతర్వాత బిసిసంఘాలు అనేక ఉద్యమాల నిర్వహించిన తదనంతరం ఆ ఆర్డర్‌ను రద్దు చేశారన్నారు. ఒకవేళ మళ్ళీ బిసిల్లో వారిని కలిపితే బి.సి. యునైటెడ్ మళ్ళీ అన్ని బి.సి. కులాలను కలుపుకొని మరొకసారి ఉద్యమిస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈసమావేశంలో సంఘం నాయకులు సముద్రాల తిరుపతి, పంతకాని శ్రీనివాస్, ఆత్మకూరి స్వామియాదవ్, నిడిగొండ మైనర్‌బాబు, వెన్నెంపల్లి మహేష్, విజయగిరి సత్యనారాయణ, మర్కకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అంకితభావంతోనే కళల్లో రాణిస్తారు : సారిపల్లి కొండలరావు




కళాకారులతో అతిథులు కొండలరావు, లక్ష్మీనారాయణ, ప్రసన్నరాణి, గురు చంద్రలేఖ తదితరులు

**రవీంద్రభారతి, నవంబరు 9 ప్రభాతవార్త :**
విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ, తపన అంకితభావంతో కళలు తదితర ఏరంగంలోనైనా గొప్పగా రాణించి అత్యున్నతస్థాయికి ఎదిగి సర్వతోముఖాభివృద్ధితో మంచి పేరుప్రఖ్యాతులు పొందుతారని డా. అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధ్యక్షుడు, సాంస్కృతికబంధు సారిపల్లి కొండలరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో శివచంద్రలహరి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్య కిన్నెర ప్రముఖ నాట్యగురువు కె.చంద్రలేఖ నేతృత్వంలో లంక లక్ష్మీనారాయణ సభాధ్యక్షతన రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఘనంగా జరిగిన సంస్థ నవ వసంత కింకిణి నాద రసరమ్యం వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన సారిపల్లి కొండలరావు ప్రసంగించారు. గురు చంద్రలేఖ ఏడుసంవత్సరాల పిన్నవయస్సులోనే భారతీయ శాస్త్రీయ నృత్యకళలపట్ల ఆసక్తితో కూచిపూడి నృత్యాన్ని అభ్యసించి ఎనిమిది సంవత్సరాలలో 50మందికిపైగా శిష్యులను నిష్ణాతులైన కళాకారులుగా తీర్చిదిద్దడం గొప్పవిశేషమని, భవిష్యత్తులో మరింత మందిని అత్తుత్యమ కళాకారులుగా తీర్చిదిద్ది కళలను, కళాకారులను ప్రోత్సహించాలని ఆమెను ఆశీర్వదించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాట్యకళామయూరి డా. ఆర్. ప్రసన్నరాణి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో చంద్రకళ ఆధ్వర్యంలో శిష్యులు ప్రదర్శించి పలు నృత్యాంశాలు విచ్చేసిన అశేష ప్రేక్షకులను ఆకట్టుకొని అబ్బురపరిచాయి. చివరిగా నృత్యప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులను అతిథులు సన్మానించి శుభాశీస్సులందజేశారు.

## ప్రార్థన స్థలాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : బాచుపల్లి ఎస్‌హెచ్‌ఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్‌రావ్

**కొంపల్లి, నవంబర్ 2, ప్రభాతవార్త**
ప్రార్థన స్థలాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని శనివారం పై అధికారుల సూచన మేరకు బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో అన్ని మత ఆరాధనా నాయకులతో బాచుపల్లి ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్ సీసీ కెమెరాల అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా వారివారి ప్రార్థనా స్థలాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రశాంతతను కాపాడుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

## అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

-ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్



పనులను పరిశీలిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, నవంబరు 9 ప్రభాతవార్త:**
ముషీరాబాద్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను స్థానిక ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆదేశించారు. శనివారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్ నుంచి ఇందిరాపార్కు వెళ్లేదారిలో జవహర్‌స్కూల్ వద్ద కచ్చామోరీ పనులను అధికారులతో కలిసి పరిశీలలించారు. వాహనదారులకు ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేతో పాటు పాల్గొన్న చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ వీరేశం కోరారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఏఈ సలామ్, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, నేతలు ముఠానరేశ్, మీడియా ఇంచార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, ఆకుల శ్రీనివాస్, పున్న సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్టగా మార్చటం అభినందనీయం

-తెలంగాణ పంచాయత్‌రాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి

**ముషీరాబాద్, నవంబర్ 9, ప్రభాతవార్త:**
యాదాద్రిని యాదగిరిగుట్టగా మారుస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించటం అభినందనీయమని తెలంగాణ పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన కవాడిగూడలో విలేఖరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు భక్తి శ్రద్ధలతో కొలిచే లక్ష్మీ నరసింహస్వామి కొలువై ఉన్న యాదగిరిగుట్టలో భక్తుల మొక్కులు చెల్లించటమే కాకుండా తమ పిల్లలకు కూడా యాదగిరి అనే పేర్లు పెట్టుకునే సాంప్రదాయం కూడా ఉందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలందరికీ యాదగిరిగుట్ట అంటే తెలుస్తుంది కానీ యాద్రాద్రి అంటే అదెక్కడ అని ఆలోచించే వారు కూడా ఉన్నారని అన్నారు. గతంలో ముఖ్యమంత్రి టి.అంజయ్య కూడా తాను ప్రయాణించే ప్రభుత్వ హెలికాప్టర్‌కు యాదగిరి అనే పేరు పెట్టారని గుర్తు చేశారు. అంతటి ప్రసిద్ధమైన యాదగిరిగుట్టకు మళ్లీ అదే పేరును ప్రతిపాదించటం తెలంగాణపౌరులుగా హర్షిస్తున్నామని తెలిపారు.

## ప్రయాణికులకు గుడ్‌న్యూస్..

-భారీగా తగ్గిన ఆర్టీసీ బస్సుల అద్దె

**హైదరాబాద్, నవంబరు 9 ప్రభాతవార్త**
శబరిమల వెళ్లే ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ శుభవార్త తెలిపింది. శబరిమల యాత్రకు బస్సు బుక్ చేసుకుంటే ఒక గురుస్వామి, పదేండ్లలోపు ఇద్దరు మణికంఠ స్వాములకు, ఇద్దరు వంటవాళ్లకు, ఒక అటెండెంట్‌కు ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. శబరిమల యాత్రకు బస్సు బుక్ చేసుకుంటే ఒక గురుస్వామి, పదేండ్లలోపు ఇద్దరు మణికంఠ స్వాములకు, ఇద్దరు వంటవాళ్లకు, ఒక అటెండెంట్‌కు ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. అలాగే వివాహాది శుభకార్యాలకు, శబరి యాత్ర, విహారయాత్రలకు బస్సులు అద్దెకు తీసుకునే వారికి రుసుమును 15 నుంచి 20 శాతం తగ్గించింది. కిలోమీటర్ ప్రకారం సూపర్ లగ్జరీ ధర రూ.65 నుంచి రూ.59కి, రాజధాని ధర రూ.84 నుంచి రూ.77కి తగ్గించింది. గ్రేటర్ హైదరాబాద్ జనరల్ బస్ పాస్ ఎక్స్‌ప్రెస్, డీలక్స్ పుష్పక్ పాస్ ఉన్న ప్రయాణికులు అట్టి పాస్ చూపించి ఏసీ బస్సుల్లో 10 శాతం రాయితీని పొందవచ్చు. కాబట్టి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రయాణికులకు బీహెచ్‌ఈఎల్ డిపో మేనేజర్ సూచించారు. మరిన్ని వివరాలకు 9652473037, 7382837094, 9959226149 నంబర్లకు సంప్రదించాలన్నారు.

## ఇంటింటి సర్వేకు పర్యవేక్షణ అధికారుల నియామకం

జిహెచ్‌ఎంసి పరిధి పర్యవేక్షణాధికారిగా సర్వరాజ్ అహ్మద్

**హైదరాబాద్, నవంబర్ 9,ప్రభాతవార్త:**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి) పరిధిలో ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో కచ్చితత్వంతోపాటు షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జీహెచ్‌ఎంసీతోపాటు జోనల్ స్థాయిలోనూ ఈ సర్వే పకడ్బందీగా నిర్వహించేందుకు క్షేత్ర స్థాయిలో సిబ్బందితో సమన్వయం కోసం పర్యవేక్షణ అధికారులను నియమించింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో పర్యవేక్షణ అధికారిగా హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సికింద్రాబాద్, చార్మినార్ జోన్లకు హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్ శ్రీవత్సను నియమించారు. ఎల్బీనగర్, ఖైరతాబాద్ జోన్లకు పురపాలక శాఖ ఉప కార్యదర్శి ప్రియాంక, శేరిలింగంపల్లి, కూకట్ పల్లి జోన్లకు జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ పర్యవేక్షించనున్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఝార్ఖండ్ ఎన్నికల అధికారిగా వెళ్లారు. అక్కడి నుంచే సర్వే తీరును ఆయన పరిశీలిస్తున్నారు. దీంతో క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా సర్వే పర్యవేక్షణ బాధ్యతలను సర్ఫరాజ్కు అప్పగించారు. జోనల్ కమిషనర్లు, పర్యవేక్షణ అధికారులను సమన్వయం చేసుకుంటూ గ్రేటర్లో నిర్దేశించిన గడువులోగా సర్వేను పూర్తి చేయాలని, జీహెచ్‌ఎంసీ కమిషనర్కు సర్ఫరాజ్ సహకారం అందించాలని ప్రభుత్వం సూచించింది.

## డ్రగ్స్ పట్టివేతలో ముంబాయి పోలీసుల రికార్డు

-పది నెలల్లో మూడు వేల 10 కిలోల మాదకద్రవ్యాల జప్తు

**హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:**
దేశ ఆర్థిక రాజధాని ముంబాయిలో మాదకద్రవ్యాల మహమ్మారి ఏ స్థాయిలో వుందనేది అందరికి తెలిసిందే. అయితే ఇదే సమయంలో డ్రగ్స్ మహమ్మారి భరతం పట్టడంలో అక్కడి పోలీసులు కూడా చురుకుగానే వ్యవహరిస్తుండడం విదితమే. తీర ప్రాంతంలో వున్న ముంబాయి నగరంలో పాక్ సహా ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్ తదితర దేశాల నుంచి సముద్ర మార్గంలో వేలాది కిలోల అనేక రకాల డ్రగ్స్ వస్తుంటాయి. ఇందులో హెరాయిన్‌తో పాటు రసాయన డ్రగ్స్ ఎక్కువగా వుంటాయి. ఈ క్రమంలో ఈ ఏడాది గడచిన పది నెలల వ్యవధిలో ముంబాయి పోలీసులు మూడు వేల 10 కిలోల మాదకద్రవ్యాలను జప్తు చేశారు. ఈ సందర్భంగా 146 మంది నేరగాళ్లను అరెస్టు చేశారు. పట్టుబడ్డ డ్రగ్స్ విలువ 55 కోట్ల రూపాయలకు పైగా వుంటుందని అక్కడి పోలీసులు చెబుతున్నారు. తాజా గా శనివారం నాడు నలుగురు బడా డ్రగ్స్ క్రిమినల్స్‌ను అరెస్టు చేసిన ముంబాయి పోలీసులు వారి వద్ద నుంచి 2.36 కోట్ల రూపాయల విలువచేసే 594 గ్రాముల హెరాయిన్‌ను జప్తు చేశారు. కాగా గడచిన పది నెలల వ్యవధిలో పట్టుబడ్డ మాదకద్రవ్యాలలో మెజారిటీ సరుకు సముద్ర తీరంలో ఓడల్లో విదేశాల నుంచి వచ్చినవే కా వడం గమనార్హం. ముంబాయి కంటే గుజరాత్ సముద్ర తీరంలో విదేశాల నుంచి మాదకద్రవ్యాలు భారీగా పట్టుబడడం విశేషం.

## నగరంలో పలు ప్రాంతాలలో తాగునీటి సరఫరాలో అంతరాయం

**హైదరాబాద్, నవంబరు 9 ప్రభాతవార్త :**
హైదరాబాద్ నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా ఫేజ్ రెండవదశలో కలబ్‌గూర్ నుంచి పటాన్‌చెరువు వరకు ఉన్న 1500 ఎంఎం డయా పిఎస్సీ పంపింగ్ మెయిన్‌కు భారీ లీకేజీలు ఏర్పడ్డాయి. ఈ లీకేజీలను అరికట్టేందుకు ఈనెల 11వ తేది సోమవారం ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు అనగా మంగళవారం 12వ తేది ఉదయం 6 గంటల వరకు మరమ్మతు పనులు చేపట్టనున్నారు. ఈ 24 గంటలు నగరంలోని పలు ప్రాంతాల్లో లో ప్రెజర్‌తో నీటిసరఫరా, మరికొన్ని ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుందని జలమండలి అధికారులు తెలిపారు. ఈ ప్రాంతాలలోని ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి అధికారులు తెలిపారు.

**అంతరాయం ఏర్పడే ప్రాంతాలు**

ఓ అండ్ ఎం డివిజన్ 15 : ఆర్‌సిపురం, అశోక్ నగర్, జ్యోతి నగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్. ఓ అండ్ ఎం డివిజన్ 24: బీరంగూడ, అమీన్ పూర్. ట్రాన్స్ మిషన్ డివిజన్ 2: ఆఫ్ టేక్ పాయింట్స్, బల్క్ కనెక్షన్లు. ఓ అండ్ ఎం డివిజన్ 6: ఎర్రగడ్డ, ఎస్.ఆర్. నగర్, అమీర్ పేట్. ఓ అండ్ ఎం డివిజన్ 9: కేపీహెచ్ బీ కాలనీ, కూకట్ పల్లి, మూసాపేట్, జగద్గిరిగుట్ట.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ముషీరాబాద్, నవంబర్ 9, ప్రభాతవార్త:** గుర్తు తెలియని వ్యక్తి (25) మృతి చెందిన ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గాంధీనగర్ సీఐ డి.రాజు తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి గాంధీ హాస్పటల్ ఎదురు సర్వోత్తమ్ హోటల్ ముందు ఎవరో గుర్తు తెలియని వ్యక్తి పడిపోయి ఉన్నాడని స్థానికులు 100కు డయల్ చేసి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న గాంధీనగర్ పెట్రోలింగ్ సిబ్బంది ఘటనా స్థలికి వెళ్లి చూసే సరికి అప్పటికే వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. ఆ వ్యక్తి వివరాల కోసం స్థానికంగా విచారించినా ఫలితం లేకపోవటంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి గాంధీ హాస్పటల్‌లోని మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచారు. వ్యక్తి నలుపు టీ షర్ట్, నలుపు రంగా ట్రాక్ ఫాంట్ ధరించి ఉన్నాడని, ఆ వ్యక్తికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.



నగరంలో జరిగిన హైలైఫ్ ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## నేటి నుంచి ఆలయంలో కార్తీక బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్స వాలకు ముస్తాబైన శ్రీలక్ష్మీ అనంతశయన స్వామి ఆలయం

**నారాయణఖేడ్ టౌన్, నవంబరు 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సంజీవన్ రావు పేటలో కొలువున్న శ్రీలక్ష్మీ అనంత శయనస్వామి ఆలయం కార్తీకమాస బ్రహ్మోత్స వాలకు ముస్తాబయింది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఈ నెల 10వ తారీఖు నుంచి 15వ తేదీ వరకు బ్రహ్మోత్స వాలు అంగరంగవైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నామని ఆలయ కమిటి బాధ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ తెలిపారు. ఆదివారం స్వామివారిని అందంగా అలంకరించిన హనుమంత వాహనంపై గ్రామంలోని పుర వీధుల గుండా శోభాయత్ర నిర్వహిస్తామన్నారు.

## ముక్తాపూర్‌లో ప్రారంభమైన సమగ్ర సర్వే



ముక్తాపూర్‌లో సమగ్ర సర్వేలో పాల్గొన్న కాంగ్రెస్ మండల అధ్యక్షులు

**నాగల్‌గిద్ద, నవంబరు 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ముక్తాపూర్‌లో శనివారం సమగ్ర కుంటుంబ సర్వే కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్ ముక్తాపూర్ ప్రత్యేక సూపర్‌వైజర్ శంకర్, ఎన్యూమరేటర్, మాజీ సర్పంచ్ జగదీష్‌లతో కలిసి ప్రారంభించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు సర్వేలో తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్యూమరేటర్‌లు రమేష్, సంగమేష్, జ్ఞానేశ్వర్, విఠల్, దత్తు, రాజు, శరణప్ప, మాలప్ప, నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ప్రత్యేక ఓటరు నమోదు ప్రారంభం



న్యాల్‌కల్‌లో ప్రత్యేక ఓటరు నమోదును ప్రారంభిస్తున్న తహసీల్దార్ భూపాల్

**న్యాల్‌కల్, నవంబరు 9, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో శనివారం తహసీల్దార్ భూపాల్ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భూపాల్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటుహక్కును నమోదు చేసుకోవాలని, ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రజలకు సూచించారు. మండలంలోని 16 పోలింగ్‌బూత్‌లలో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తహసీల్దార్ వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్యామ్‌రావు, ఎఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై విద్యార్థులకు అవగాహన

**సిర్గాపూర్, నవంబరు 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నల్లవాగు గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు శనివారం న్యాయ మూర్తి శ్రీధర్ మంథని చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీధర్ మంథని మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహనపొంది ఉండాల్సిన అవసరం ఉందన్నారు. చట్టాలపై అవగాహన ఉంటే ఏది మంచో, ఏది చెడో అవగతం అవుతుందన్నారు. గొడవలకు పాల్పడితే కలిగే నష్టాలపై అవగతం ఉంటే, గొడవ జోలికి పోకుండా ఉంటామని, ఫలితంగా జీవితం ప్రశాంతంగా సాగుతుందన్నారు. చట్టాలపై అవగాహనలేని కొందరు కొట్లాటలకు పోయి, తిట్టుకోవడం చేస్తూ ఉంటారని, దీంతో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడం ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహనపొంది తమ కుటుంబ సభ్యులకు, పరిసరాలలోని వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు భోజిరెడ్డి, మారుతిరెడ్డి, జవన్ మోహిన్ పాటిల్, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎల్‌ఓసి అందచేసిన చైర్మన్ గిరిధర్‌రెడ్డి



బిలాల్‌పూర్‌లో ఎల్‌ఓసి అందచేస్తున్న సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి

**జహీరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని కోహీర్ మండల పరిధిలోని బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన బీరప్ప అనారోగ్యానికి గురికావడంతో కార్పోరేట్ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందుకునేందుకు 2 లక్షల రూపాయల ఎల్‌ఓసిని సెట్విన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి శనివారం సాయంత్రం అందచేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహా, రోడ్డు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిల సహకారంతో బాధితుడికి 2లక్షల రూపాయల చెక్కును మంజూరు చేయించినట్లు గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. చెక్కును అందుకున్న బీరప్ప కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, గిరిధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, బాధిత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## సమగ్ర సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

**కేశంపేట, నవంబర్ 9 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆర్థిక, విద్య, సామాజిక, రాజకీయ, కులగణన, సమగ్ర సర్వేలను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. కేశంపేట తహసిల్దార్ ఆజం అలీ, మండల ప్రత్యేక అధికారి రాజారత్నం స్థానిక ఎంపిడివో రవిచంద్ర కుమార్ రెడ్డితో కలిసి శనివారం కేశంపేట మండల పరిధిలోని సంగెం, ఎ క్లాస్ కంపేట, కొత్తపేట, బైర్ఖాన్‌పల్లి, చౌలపల్లి, అల్వాల, పోల్కొనిగుట్ట తండా, గ్రామాలలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేలను ఆకస్మికంగా తనిఖీ చేశారు, ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వేలో ఎక్కడా తప్పులు దొరలకుండా సరైన పద్ధతిలో నిర్వహించాలని ఆయన సిబ్బందికి సూచించారు. అనంతరం కాంగ్రెస్ నేతలతో కలిసి సమగ్ర కుటుంబ సర్వేపై అవగాహన కల్పించారు. తమవద్దకు వచ్చిన ఎన్యుమరేటర్లకు పూర్తి సమాచారం అందించాలని సమగ్ర కుటుంబ సర్వేకు వచ్చిన అధికారులకు సరియైన పత్రాలతో వారి వారి ఇంటి వద్ద ఉండి సహకరించాలని ఆయన సూచించారు.

# ఉద్యమకారుల మహాపాదయాత్రను విజయవంతం చేయండి

### ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకులు గడిపె మల్లేష్




ఉద్యమకారులను సత్కరిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్‌టౌన్, నవంబరు 9, ప్రభాతవార్త** తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర నాయకులు గడిపె మల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం హుస్నాబాద్‌లోని అణబేరి, సింగిరెడ్డిల అమరుల భవన్‌లో తెలంగాణ ఉద్యమకారుల నియోజకవర్గ స్థాయి సమావేశం నియోజకవర్గ ఇంచార్జీ మాదాసు శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్లేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యమ కారులకు జిల్లా కేంద్రాలలో 250 గజాల ఇంటి స్థలాలతో ఇందిరమ్మ పథకం ద్వారా ఇండ్లు కట్టిస్తామని అధికారంలోకి వచ్చాక కాలయాపన చేయడం సబబు కాదన్నారు. ఎన్నికల సమయంలో వారికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27, 28వ తేదీలలో కరీంనగర్ తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం నుండి వేములవాడ వరకు మహా పాదయాత్ర నిర్వహిస్తున్నామని, ఈ పాదయాత్రలో ఈ ప్రాంత ఉద్యమకారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉద్యమకారులందరికీ గడిపె మల్లేష్ కటకం కుమారస్వామి ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మెన్ కుమార స్వామి, సదానందం, శ్రావణ్‌రెడ్డి, సంజీవరెడ్డి, మనోహర్, అంకుశావళి, లక్ష్మీ, స్వామితో పాటు తదితరులు ఉన్నారు.

## యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ వేడుకలు



సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి

**గుమ్మడిదల, నవంబరు 9 ప్రభాతవార్త:** గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లి గ్రామంలో శుక్రవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్మల గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతు సదర్ ఉత్సవాలు యాదవుల ఐక్యతను చాటుతాయని తెలిపారు. పాడి పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్న యాదవ సోదరులు పశువుల సంతతి పెరగడానికి దున్నపోతులను పవిత్రంగా చూడడం ఈ సదర్ సమ్మేళన ప్రత్యేకత అన్నారు. సదర్ ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విన్యాసాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ మాజీ చైర్మన్లు సురభి నాగేందర్ గౌడ్, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, యాదవ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలను నాటి సంరక్షించాలి



కళాశాల ఆవరణలో మొక్కలను నాటుతున్న విద్యార్థులు

**చిన్నశంకరంపేట, నవంబరు 9, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శశిధర్ సూచించారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రాంగణంలో విద్యార్థుల చేత మొక్కలను నాటించారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రతపై వారికి అవగాహన కల్పించారు.

## గోపాష్టమి సందర్భంగా గోవులకు పూజలు



గోపాష్టమి సందర్భంగా గోమాతకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

**చిన్నశంకరంపేట, నవంబరు 9, ప్రభాతవార్త:** మండల పరిధి చందంపేటలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోపాష్టమని సందర్భంగా విశ్వహిందూ పరిషత్ నాయకులు, మహిళలు గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రుద్రారంలోని హనుమాన్ మందిరంలో బజరంగ్‌దళ్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ గోవులను పూజిస్తే 33వేల కోట్ల దేవతలను పూజించినట్లే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సన్ ఉపాధ్యక్షులు కుమ్మరి లింగం, ప్రఖండ భజరంగ్‌దళ్ సంయోజక్ నవీన్ గౌడ్, శ్రీకాంత్ మహిళలు పాల్గొన్నారు.

## కులగణన సర్వేను పరిశీలించిన ఆర్డీవో

**నర్సాపూర్ నవంబర్ 9. ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న ఇంటింటి కుటుంబ కులగణన సర్వేను శనివారం నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో ఎన్యుమరేటర్‌లు నిర్వహిస్తున్న సర్వేను మండల తహశీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించడం జరిగింది. ఈ మేరకు ఈ ఇంటింటి సర్వేను ఎటువంటి తప్పులు లేకుండా చేయాలని ఆయన ఎన్యుమరేటర్‌లకు సూచించారు. అదేవిధంగా మండల పరిధిలోని రుస్తుంపేట గ్రామంలోని ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దాన్యం కొనుగోలు కేంద్రాన్ని సైతం ఆర్డీవో మహిపాల్ పరిశీలించడం జరిగింది. దాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరును నిర్వాహకులను అడిగి తెలుసు కున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించాలని ఆర్డీవో మహిపాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్‌తో పాటు ఎంపిడివో మధులత, మండల తహశీల్దార్ శ్రీనివాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మన్నన్

**చిన్నశంకరంపేట, నవంబరు 9, ప్రభాతవార్త:** అర్హులైన వారు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ మన్నన్ తెలిపారు. శనివారం మండల పరిధి చందంపేటలో ఓటరు నమోదు సవరణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని ఆయన పరిశిలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 10వ తేదిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, జనవరి 1వ తేది 2025 నాటికి 18 సంవత్సరాలు నిండే యువత కొత్త ఓటర్‌గా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



వరి కొనుగోలు కేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ మన్నన్

**చిన్నశంకరంపేట, నవంబరు 9, ప్రభాతవార్త:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మన్నన్ సూచించారు. శనివారం మండల పరిధి గవ్వలపల్లిలోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజవరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. కేంద్రాలలో రైతులకు సకల సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు.

## కళాశాలలో బీమాతాన్ ఇన్నోవహక్

**నర్సాపూర్ నవంబర్ 9. ప్రభాతవార్త:** నర్సాపూర్ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 8, 9 తేదీల్లో ప్రథమ జాతీయ స్థాయి 24 గంటల బీమాతాన్ ఇన్నోవహక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలల నుండి సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ మేరకు విద్యార్థులు బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్(బీమ్)లో గణనీయమైన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. విద్యార్థులు బృందాలుగా ఏర్పడి రెవిట్ ఆర్కిటెక్చర్ వంటి ఆధునిక సాఫ్ట్‌వేర్ ఉపయోగించి సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యం, స్థిరత్వాన్ని ఉటంకిస్తూ ఆవిష్కరణాత్మక 3డి మోడల్స్‌ను రూపొందించడం జరిగింది ఈ కార్యక్రమంలో విజేతలకు నగదు, జ్ఞాపికలను కళాశాల డైరక్టర్ డాక్టర్ లక్ష్మిప్రసాద్ చేతుల మీదుగా అందజేయడం జేయడం జరిగింది. డాక్టర్ లక్ష్మిప్రసాద్. డాక్టర్ సంజయ్‌దూబే, డాక్టర్ కృష్ణారావు, బాపిరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం: ఎంపి రఘునందన్‌రావు



వైద్యశిబిరంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపి రఘునందన్‌రావు

**రామచంద్రాపురం, నవంబరు 9, ప్రభాతవార్త:** ఆరోగ్యమే మహాభాగ్యమన్న సత్యాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచు కోవాల్సిన అవసరం ఉందని, ఎవరి ఆరోగ్యం పట్ల వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మెదక్ బిజెపి ఎంపి, ప్రముఖ న్యాయవాది రఘునందన్‌రావు అన్నారు. శనివారం తెల్లాపూర్‌లో బిజెపి కిసాన్ మోర్చా అధ్యక్షులు మల్లెపల్లి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి ఎంపి రఘునందన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై వైద్య పరీక్షలు చేయించుకుని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భం గా ఎంపి రఘునందన్‌రావు మాట్లాడుతూ ప్రతివ్యక్తి ఉదయం, సాయంత్రం, వేళల్లో ఆరోగ్యం కొరకు కొంతసమయాన్ని కేటా యించాలని సూచించారు. యోగ, సైకిల్, వాకింగ్, వ్యాయామం లాంటివి నిత్యం క్రమం తప్పకుండా చేస్తే ఆరోగ్యం తమ అదుపులో ఉండటం తథ్యమని గుర్తు చేశారు. ఈ ఉచిత వైద్యశిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్విని యోగం చేసుకుంటూ ఉండాలని వివరించారు. తాము పదిమందికి ఉపయోగపడితే సమాజం ప్రశాంతంగా బాగుంటుందని ఎంపి రఘునందన్‌రావు అభిప్రాయపడ్డారు.

## నినాదంగా మారినప్పడే రెవెన్యూ డివిజన్




సమావేశంలో మాట్లాడుతున్న రామగళ్ళ పరమేశ్వర్

**చేర్యాల, నవంబరు 9, ప్రభాతవార్త:** చేర్యాల రెవెన్యూ డివిజన్ అంశం రాజకీయ పార్టీల నినాదంగా కాకుండా ప్రజల నినాదంగా మారినప్పుడే డివిజన్ సాధనకు సాధ్యపడుతుందని జెఏసి చైర్మన్ రామగళ్ళ పరమేశ్వర్ అన్నారు. జెఏసిలో ఉన్న అనుబంధ కమిటీలు తక్షణమే బాధ్యతలు చేపట్టి క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై ప్రజల పక్షాన పని చేస్తూ రేపటి రోజుల్లో ప్రజలను ఉద్యమం వైపు నడిపిస్తూ రెవెన్యూ డివిజన్ సాధనకు గ్రామ స్థాయిలో ఉన్న అధ్యక్షుల మొదలు అనుబంధ సంఘాల బాధ్యులందరు కలిస్తేనే గాని ప్రజల నినాదంగా మారదని అన్నారు. ఆ దిశగా మండల కమిటీలను ప్రకటిస్తున్నామని తెలిపారు. సమావేశంలో డివిజన్ కో-కన్వీనర్ తోకల ఉమారాణి, రాజకీయ పార్టీల సంప్రతింపుల కమిటీల సమన్వయ కర్తలు పూర్మ ఆగంరెడ్డి, అందె బీరయ్య, జెఏసి అధికార ప్రతినిధి అందె అశోక్, కార్యక్రమాల అమలు నిర్వహణ కమిటీ సమన్వయకర్త ఆది శ్రీనివాస్, పూర్మ సంజీవరెడ్డి, కార్యాలయ కార్యదర్శి బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేసిన ఘనత హరీష్‌రావుదే

**సిద్ధిపేట అర్బన్, నవంబరు 9, ప్రభాతవార్త:** సిద్ధిపేట జిల్లాతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఘనత మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావుది అని సిద్ధిపేట బిఆర్ఎస్ పార్టీ 37వ వార్డు నాయకులు సాయిప్రేమ్ అన్నారు. శనివారం ఇటీవల మైనంపల్లి హరీష్‌రావుపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ విషయంపై ఏర్పాటు చేసిన సమావేశంలో సాయిప్రేమ్ మాట్లాడుతూ ఊసరవెల్లిలా పార్టీలు మారే మైనంపల్లికి హరీష్‌రావు గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. గతంలో హరీష్‌రావు దేవుడు, ఆయన దయవల్లనే నేను బతికి ఉన్నానని మాట్లాడిన వ్యక్తే, ఇప్పుడు విమర్శలు చేస్తుంటే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. హరీష్‌రావుపై ఇష్టం వచ్చినట్లు ప్రచారం చేస్తే, చూస్తూ ఊరుకోమని హరీష్‌రావు విషయంలో నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో మద్దెల నర్సింహులు, గ్యాదరి సందీప్, గణేష్, రజినీకాంత్, అభిలాష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## వివరాలను పక్కాగా నమోదు చేయాలి

### -జిల్లా కలెక్టర్ మనుచౌదరి



దుద్దెడలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**కొండపాక, నవంబరు 9, ప్రభాతవార్త:** తప్పులు లేకుండా ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి కులగణన వివరాలు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి సూచించారు. శనివారం దుద్దెడలో నిర్వహిస్తున్న కులగణన సర్వే కార్యక్రమాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరు ఎన్యూరేటర్లు తమ ఇండ్ల వద్దకు వచ్చినపుడు కుటుంబ సభ్యుల అధార్ కార్డులను, రేషన్ కార్డును, ధరణి పాస్ బుక్ లాంటివి సిద్దంగా ఉంచుకొని ఎన్యూమరేటర్లు అడిగిన వెంటనే వాటిని చూపించి సహకరించాలని కోరారు. తప్పులు దొర్లకుండా ప్రజలు ఇచ్చిన సమాచారం పక్కాగా నమోదు చేయాలన్నారు. ఎన్యూమరేటర్లు సర్వే చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఎన్యూమరేటర్లకు, సూపర్‌వైజర్లకు పలు రకాల సూచనలు, సలహాలు ఇచ్చారు. అయన వెంట తహసీల్దార్ దిలిప్ నాయక్, ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబసర్వేకు ప్రజలు సహకరించాలి



సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, నవంబరు 9 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపడుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని గుమ్మడిదల మండల తాజా మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్ అన్నారు. శనివారం గుమ్మడిదల మండల ప్రత్యేక అధికారి అఖిలేష్ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి ఉమాదేవిలతో కలిసి గుమ్మడిదలలో పరిధిలో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కుమార్ గౌడ్ మాట్లాడుతూ వివరాల సేకరణ నిమిత్తం ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు సమగ్ర సమాచారాన్ని అందించాలన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల గణనతో ప్రభుత్వానికి పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. తద్వారా పథకాలు, కార్యక్రమాల అమలుకు ప్రభుత్వానికి ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ఇంటికి వచ్చే సర్వే బృందాలకు సమగ్ర వివరాలను అందించి సహకరించాలని కోరారు.

## ఉచిత వైద్యశిబిరం విజయవంతం

**కొండపాక, నవంబరు 9, ప్రభాతవార్త:** హైదరాబాద్‌కు చెందిన అసియాన్ ఇన్సిట్యూట్ అఫ్ టెక్నాలజీ, యూరాలజీ అడ్మినిస్ట్రేటర్ జికె రాజు అధ్వర్యంలో శనివారం కొండపాక మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సాధారణ వ్యాధులతో పాటు మూత్ర పిండాలకు సంబంధించిన రోగులకు తగిన సూచనలు, సలహాలను ఇస్తూ వారికి కావాలసిన మందులను పంపిణీ చేశారు. 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు గౌతం, జార్జి మూలార్, సందిప్ కుమార్, గౌతం కుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**చిన్నశంకరంపేట, నవంబరు 9, ప్రభాతవార్త:** నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఇంచార్జి ఏఈ జీవన ఓ ప్రకటనలో తెలిపారు. నేడు చిన్నశంకరంపేట పట్టణంలోని 33/11 కేవి విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల నేపథ్యంలో ఈ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు చిన్నశంకరంపేట పట్టణంతో పాటు, పారిశ్రామికవాడ, రుద్రారం, కామారం గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిచి పోతుందని, రైతులు, వినియోగదారులు సహకరించాలని ఆమె కోరారు.

## భవానీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి తదితరులు

**కంగ్టి, నవంబర్ 9 ప్రభాతవార్త:** కంగ్టి మండల పరిధిలోని జీర్గి తండాలో గల భవానీమాత సేవాలాల్ మహారాజ్ ఆలయాన్ని దర్శించుకుని ఆలయంలో ఎమ్మెల్యే డా.పి.సంజీవరెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి పి.చంద్ర శేఖర్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తండావాసులు అందరూ గత ఎన్నికల్లో డాక్టరు పి.సంజీవరెడ్డి కాంగ్రెస్‌పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలవాలని తండావాసులు మొక్కుకున్నారు. ఎమ్మెల్యేగా సంజీవరెడ్డి గెలుపొందడంతో తండావాసులు తమ మొక్కుబడిని చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా తండావాసులు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాపై నమ్మకంతో నన్ను ఎన్నికల్లో గెలిపించడంతో మీకు ఎల్ల వేళలా ఋణపడి ఉంటానని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేను పూలమాల, శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు సర్దార్ నాయక్, పల్లవి పరశురాం, విఠల్‌రెడ్డి మాజీ ఎంపిటిసి, లక్ష్మణ్‌నాయక్, బాబు, మాజీ సర్పంచ్ దేవిసింగ్, తానాజీరావు, రాందాస్, సంతోష్‌పాటిల్, జీర్గి తండావాసులు ప్రజలు కాంగ్రెస్ నాయకులు, కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల స్థాయిలో చెకుముకి పోటీలు



నిజాంపేట్ జడ్పిహెచ్‌ఎస్‌లో చెకుముకి పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు

**నిజాంపేట్, నవంబరు 9, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జనవిజ్ఞాన వేదిక, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలు 2024 పాఠశాలస్థాయి పోటీలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభా ప్రశ్నావళిని ప్రధానోపాధ్యాయులు ఎన్. శ్రీనివాస్ ఆవిష్కరించి పరీక్షలు నిర్వహించారు. 8,9,10వ తరగతిల్లో విద్యను అర్జిస్తున్న తెలుగు, ఆంగ్లమీడియం విద్యార్థులు పరీక్షల్లో పాల్గొంటారని, ప్రశ్నాపత్రంలో మొత్తం 40 ప్రశ్నలు ఉండగా, 40శాతం ప్రశ్నలను 8వ తరగతి విద్యార్థులు, 60శాతం ప్రశ్నలు 9వ తరగతి విద్యార్థులు, 10వ తరగతి విద్యార్థులు 100 శాతం ప్రశ్నలు చేసే విధంగా రాష్ట్ర స్థాయి విషయ నిపుణులచే ప్రశ్నావళిని రూపొందించారని జనవిజ్ఞాన వేదిక జిల్లా సలహాదారు శ్రీనివాస్ రాథోడ్ పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో ముగ్గురిని ప్రథమ, ద్వితీయ, తృతీయులుగా నిలిచిన వారిని మండల స్థాయికి ఎంపికచేయడం జరుగుతుందన్నారు. మండలస్థాయి పరీక్షలు నవంబరు 21న, జిల్లాస్థాయి పరీక్షలు నవంబరు 28న, రాష్ట్రస్థాయి పరీక్షలు డిసెంబరు మాసంలో నిర్వహిస్తారన్నారు. విద్యార్థుల్లో సైన్స్‌పట్ల అవగాహన పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక కార్యక్రమాలు ఉపయోగకరంగా ఉన్నాయని తెలుపుతూ, విద్యార్థుల్లో కాంపిటిషన్ పరీక్షరాసే విధానం తెలుసుకుంటారని, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను ఆర్జించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు సూచించారు.

## ఉత్సాహంగా సాగుతున్న రాష్ట్రస్థాయి క్రీడలు



క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలుపుతున్న లైబ్రరీ చైర్మన్ లింగమూర్తి

**హుస్నాబాద్‌రూరల్,నవంబరు9,ప్రభాతవార్త:** హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ప్రారంభమైన 68వ ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు శనివారం రెండవరోజు ఉత్సాహంగా సాగాయని రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ క్రీడా పోటీల అబ్జర్వర్ శ్రీనివాస్ తెలిపారు.నిర్వహించిన లీగ్ మ్యాచ్‌లో గెలుపొందిన జట్లు నాకౌట్ దిశకు చేరుకున్నాయని నౌకౌట్ పద్ధతిలోనే ఆదివారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి హాజరై క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రతాప్‌రెడ్డి కృషితో త్వరలో కోర్టు

**చేర్యాల,నవంబర్ 9,ప్రభాతవార్త:** చేర్యాల ప్రాంతప్రజల కోరిక మేరకు కాంగ్రెస్ పార్టీ జనగామ డిసిసి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కృషితో త్వరలో కోర్టు ప్రారంభం కాబోతుందని చేర్యాల మండల సోషల్ మీడియా అధ్యక్షులు అందె నాని బాబు తెలిపారు. శనివారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో అందె నానిబాబు పాల్గొని మాట్లాడుతూ చేర్యాల ప్రాంత బిడ్డ కొమ్మూరని, ఆయన గొప్ప ప్రజా నాయకుడన్నారు. గతంలో అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ కోర్టు ఏర్పాటుకు ఏమాత్రం కృషి చేయలేదన్నారు. నేడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కోర్టు స్టాఫ్ జీవో వచ్చిందన్నారు. కల్లబొల్లి మాటలతో నేనే మంజూరు చేయించానని చెప్పడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ త్వరలోనే చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా కూడా మారుస్తుందని అన్నారు.



మాట్లాడుతున్న అందె నానిబాబు

## ప్రమాద సూచికలు ఏర్పాటు చేయమంటే దాడి చేస్తారా...!

**హుస్నాబాద్‌రూరల్,నవంబరు9,ప్రభాతవార్త:** హుస్నాబాద్ శివారులోని ఆరెపల్లి రోడ్డులో సిసి రోడ్డు నిర్మాణ పనుల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచిస్తే అక్కడే ఉన్న కాంట్రాక్టర్, వర్కర్లు తనపై దాడికి పాల్పడ్డారని వాహనదారుడు రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆరెపల్లి నుండి హుస్నాబాద్‌కు తన ద్విచక్ర వాహనంపై తన కుటుంబ సభ్యులతో వస్తున్న రాజ్‌కుమార్ రోడ్డు పనులు చేసేటప్పుడు పక్కనుండి మార్గాన్ని ఏర్పాటు చేసి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడం వల్ల వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని కాంట్రాక్టర్‌కు చెబితే తనతోపాటు తనభార్యపై దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారని వాపోయారు. దాడిచేసిన వారిపై హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# మత్స్యకార్మికుల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం



అల్లాదుర్గం చెరువులో చేపపిల్లలను వదులుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి

**అల్లాదుర్గం, నవంబరు 9, ప్రభాతవార్త:** మత్స్య కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని వట్‌పల్లి మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల లక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన అల్లాదుర్గం గ్రామశివారులోని పెద్ద పటేల్ చెరువులో శనివారం మత్స్యకార్మికులకు 100శాతం సబ్సిడీతో చేపపిల్లలను చెరువులో చైర్మన్ లక్ష్మి విడుదల చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ లక్ష్మి మాట్లాడుతూ, గత ప్రభుత్వం నాసిరకం చేపపిల్లలను పంపిణి చేసి మత్స్యకార్మికులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. పెద్ద పటేల్ చెరువులో 1 లక్ష 11వేల 230 చేపపిల్లలను వదలడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేషారెడ్డి, ఎస్సి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బలరాంలు అన్నారు. ముదిరాజ్ సోదరులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖాధికారి భరత్, మండల ఎఈఓ అమృత్, జిల్లా మత్స్యశాఖాధ్యక్షులు రామ కృష్ణయ్య, డైరెక్టర్లు అంజయ్య, అక్షయ్, మండల అధ్యక్షులు కనుకంటి భూమయ్య, సభ్యులు మురాడి రాములు, బుదాల యాదయ్య, కళ్ళాయి వెంకటేశం, గోర్ల సాయిలు, నీళ్ల వీరేశం, అరిగే నర్సింలు, దొంతలక్ష్మయ్య, కాటి లక్ష్మణ్, నీళ్ల బేతయ్య, గోండ్లబాలయ్య, కాంగ్రెస్ నాయకులు బాలకిషన్, సదానందం, బేతయ్య, మత్స్యశాఖ సిబ్బంది యాదగిరి,బాలాజీ, శ్రావణ్ పాల్గొన్నారు.

## దుర్గమ్మను దర్శించుకున్న జిల్లా న్యాయమూర్తి



దుర్గాభవాని మాతను దర్శించుకుంటున్న జిల్లా న్యాయమూర్తి సిరి సౌజన్య

**పాపన్నపేట, నవంబరు 9, ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గాభవాని మాతను శనివారం మెదక్ జిల్లా న్యాయమూర్తి సిరి సౌజన్య తన కుటుంబసభ్యులతో కలసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న న్యాయమూర్తి కుటుంబసభ్యులను అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా న్యాయమూర్తి కుటుంబసభ్యులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు ఆశీర్వచనాలు చేయగా, ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలు, శాలువాలతో సత్కరించారు. న్యాయమూర్తి ఆలయానికి వచ్చిన సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తనసిబ్బందితో బందోబస్తును నిర్వహించారు.

## మండలంలో ప్రారంభమైన సమగ్ర కుటుంబసర్వే



కుటుంబ సర్వేను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు, ఎన్యూమరేటర్లు

**చౌటకూరు, నవంబరు 9, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర కుటుంబసర్వే)ను మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం ఎన్యూమరేటర్లు ప్రారంభించారు. మండల పరిధిలోని బొమ్మారెడ్డిగూడెంలో కాంగ్రెస్ నాయకులు, ఎన్యూమరేటర్లు, అధికారులు సర్వేను ప్రారంభించారు. ప్రతి ఒక్కరు తమకుటుంబ వివరాలను సర్వేలో తెలపాలని, ఎన్యూమరేటర్లకు తమవంతు సహకరించాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు.

## రోడ్లపై ధాన్యం ఆరబెడితే కఠినచర్యలు



రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం రైతులకు హెచ్చరికలు చేస్తున్న పోలీసులు

**పుల్‌కల్, నవంబరు 9, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని ఆయా గ్రామాల్లోని రోడ్లపై రైతులు తాము పండించిన ధాన్యంను రోడ్లపై ఆరబెడితే కఠినచర్యలు తప్పవని పుల్‌కల్ పోలీసులు హెచ్చరించారు. శనివారం జాతీయ రహదారి పక్కన ధాన్యం ఆరబెట్టిన రైతులకు పోలీసులు అవగాహన కల్పించారు. రోడ్లపై పంటధాన్యాలు ఆరబెడుతుండటంతో అటుగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని, ఇటీవల జరిగిన పలుప్రమాదాలను గురించి రైతులకు వివరించారు. పరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు రోడ్లపై కాకుండా ఇతర ప్రాంతాల్లో ధాన్యం ఆరబెట్టుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించి జాతీయ రహదారులపై వడ్లు ఆరబెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, నవంబరు 9 (ప్రభాతవార్త):** మర్కుక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన చిన్నబోయిని శ్రీరాములు మరణించగా విషయం తెలుసుకున్న మాజీ ఎంపిపి పాండుగౌడ్ శనివారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట మాజీ వార్డు మెంబర్ ప్రభాకర్, చెక్కలి బాల్‌నర్సు, మ్యాకల శ్రీనివాస్, శివ, అశోక్, షాదుల్లా, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావును కలిసిన ఎమ్మెల్యే



మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును కలిసిన ఎమ్మెల్యే, బిఆర్‌ఎస్ నాయకులు

**జహీరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** మాజీ మంత్రి, సిద్ధిపేట బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావును శనివారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, మొగుడంపల్లి మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులు సంజీవరెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌లు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇటీవలనే మొగుడంపల్లి మండలానికి సంజీవరెడ్డిని పార్టీ అధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా మాజీ మంత్రిని కలుసుకున్నారు. సంజీవరెడ్డిని మాజీ మంత్రి హరీష్‌రావు శాలువాతో సత్కరించి అభినందించారు. పార్టీ పటిష్ఠతకు అంకితంకావాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఆత్మకమిటి చైర్మన్ పెంటారెడ్డి, జహీరాబాద్, కోహీర్ మండలాల బిఆర్‌ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, నర్సింలు, మాజీ సర్పంచ్‌లు రాజశేఖర్, పర్వేజ్, చిన్నరెడ్డి, నయీం, రాథోడ్, భీమ్‌రావు నాయక్, సంజుపవార్ తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ గడ్డపై బిఎస్‌పి జెండా ఎగరవేస్తాం



బిఎస్పి జిల్లా అధ్యక్షులు శంకర్ సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**హుస్నాబాద్‌టౌన్,నవంబరు9,ప్రభాతవార్త** వచ్చే స్థానిక ఎన్నికలతో పాటు శాసనసభ ఎన్నికల్లో సైతం హుస్నాబాద్ గడ్డపై బిఎస్పి జెండా ఎగరవేసేస్తామని బిఎస్పి జిల్లా అధ్యక్షులు ఎనగందుల శంకర్ అన్నారు. శనివారం రోజున పట్టణంలోని బిఎస్పి పార్టీ కార్యాలయంలో పార్టీ అగ్రనేత మాయావతి పుట్టినరోజు సందర్భంగా హుస్నాబాద్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల బరిలో దిగేందుకు పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ రవిందర్‌గౌడ్, వేల్పుల రాజు, మల్లేష్, సుధాకర్, రవిందర్, బాబు, శ్రీనివాస్, హన్మంతుతో పాటు తదితరులు ఉన్నారు.

## పొరపాట్లు లేకుండా సర్వే చేపట్టాలి!



అందోలు మండలంలోని గ్రామాల్లో సర్వేను పరిశీలిస్తున్న డిపివో సాయిబాబ

**జోగిపేట, నవంబర్ 09, ప్రభాతవార్త:** ప్రభుత్వం చేపడుతున్న కులగణన సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయితీ అధికారి సాయిబాబ అన్నారు. ఆయన శనివారం మండల పరిధిలోని సంగుపేట, డాకూరు, ఎర్రారం గ్రామాల్లో కులగణన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొరపాట్లకు అవకాశం లేకుండా సర్వే చేపట్టాలన్నారు. ఇది భవిష్యత్తులో ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకోనుందని పేర్కొన్నారు. మండల పరిధిలోని తాలెల్మ గ్రామంలో ప్రత్యేకాధికారి మెప్మా పిడి గీత సర్వే నిర్వహిస్తున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంపిడివో రాజేశ్‌కుమార్,ఎంపివో అశోక్,పంచాయితీ కార్యదర్శి సాయిలీల పాల్గొన్నారు.

# కులగణనకు ప్రతి ఒక్కరు సహకరించాలి: ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**కంగ్టి, నవంబరు 9, ప్రభాతవార్త:** ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణన సర్వేకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే డాక్టరు సంజీవరెడ్డి అన్నారు. శనివారం కంగ్టి మండలం పరిధిలోని గాజుల్‌పాడ్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక ఉపాధి, రాజకీయ, ఆర్థిక, విద్య కులగణనపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులగణన సర్వేలో అధికారులకు ప్రజలు సహకరించి ప్రతి ఒక్కరు కుటుంబ సర్వే చేయించుకోవాలని అన్నారు. పూర్తి స్థాయిలో కుటుంబ వివరాలను నమోదు చేయించాలని ఎమ్మెల్యే గ్రామస్థులకు సూచించారు. వలసలు వెళ్లిన వారి కుటుంబ వివరాలను ఫోన్ ద్వారా అధికారులకు సమాచారం అందజేసి సర్వే చేయించుకోవాలని అన్నారు. గత ప్రభుత్వం ప్రజల గురించి పట్టించుకోలేదన్నారు. ప్రజాప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి అడిగే స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు కల్పించిందన్నారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్‌రెడ్డి, సిడిసి చైర్మన్ శాదుల్, పండరి నాథ్ నాగన్న, మాధవరావు, మాజీ ఎంపిపిలు సర్దార్‌నాయక్ మాజీ జడ్పిటిసి మనోహర్‌రావు పాటిల్, మాజీ సర్పంచ్ మస్తాన్, సురేష్, దుళ్ల పాటిల్, శివాజీపాటిల్, బాబు, కాశీనాథ్‌పాటిల్, గౌస్, జ్ఞానేశ్వర్‌పాటిల్, విఠల్‌పాటిల్, దీపక్‌రావు, సాయిలు, భీమ్‌రావు, నాందేవ్, తులసీరావు, ప్రేమ్ దాస్, చాకలి ధన్‌రాజ్, శంకర్, కుపేందర్‌రెడ్డి, కాశీనాథ్ మాజీ ఎంపిటిసి, బాబుపాటిల్, లక్ష్మణ్ నాయక్, బోజిరాంనాయక్, గంగారాం, వీరయ్య స్వామి, శేక్ హుస్సేన్, సందేవ్‌నాయక్ తదితర నాయకులు పాల్గొన్నారు.



కులగణ సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## చెలిమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

**గజ్వేల్ టౌన్, నవంబరు 9 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లోని 10వ వార్డు రామాలయం వీధికి చెందిన చిక్కుడు కిరణ్ గజ్వేల్‌లో ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్‌లో ట్రాలీ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుండగా అతనికి భార్య పావని, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆగస్టు 20వ తేదీన గౌరారం వద్దనజరిగిన రోడ్డు ప్రమాదంలో కిరణ్ మృతిచెందగా, అతని కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలుసుకున్న చెలిమి ఫౌండేషన్ సభ్యులు శనివారం రూ. 3500, నిత్యావసర సరుకులు, 11,500 నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు మంగలిపల్లి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కొండాపురం యాదగిరి, మాజీ అధ్యక్షుడు గుర్రం తులసీదాస్, గుంటుకు శ్రీనివాస్, పెద్దూరి శ్రీనివాస్, పిట్ల ఆంజనేయులు, యాట ఆంజనేయులు, గంగిశెట్టి రమేష్, నర్సింలు, నాగపురి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో మొదలైన ఇంటింటి సర్వే



హెగ్గెల్లిలో ఇంటింటి సమగ్ర సర్వేలో పాల్గొన్న జడ్పి సిఈఓ జానకిరెడ్డి

**జహీరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర సామాజిక సర్వే శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రారంభించారు. మండల పరిధిలోని హెగ్గెల్లి గ్రామంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జడ్పి సిఈఓ జానకిరెడ్డి, మండల ప్రత్యేకాధికారి, ఎడిఎ భిక్షపతి, ఎంపిడిఓ మహేందర్ రెడ్డిలు హాజరై సర్వేను ప్రారంభించారు. ప్రజల నుంచి సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఈఓ జానకిరెడ్డి మాట్లాడుతూ ప్రజలు విధిగా తమకుటుంబ వివరాలను ఎన్యూమరేట్లకు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

## కార్మికుల ధర్నాకు బిఆర్‌ఎస్ మద్దతు




ధర్నాలో మాట్లాడుతున్న బిఆర్‌ఎస్ నేత నామ రవికిరణ్

**జహీరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న పిఎఫ్, ఈఎస్ఐ డబ్బులను వెంటనే జమ చేయాలని డిమాండ్‌చేస్తూ మున్సిపల్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికుల ధర్నాకు బిఆర్‌ఎస్ మద్దతు ప్రకటించింది. శనివారం ధర్నా శిబిరానికి బిఆర్‌ఎస్ నేత నామ రవికిరణ్, బండి మోహన్‌లు చేరుకుని కార్మికులకు సంఘీభావం ప్రకటించి ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. కార్మికుల 11 నెలల పిఎఫ్ డబ్బులు, 6 నెలల ఈఎస్ఐ డబ్బులు మున్సిపల్ అధికారులు కార్మికుల ఖాతాల్లో జమచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని హెచ్చరించారు. కార్మికులు ధర్నాకు పూనుకున్నా మున్సిపల్ అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. అధికారులు వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్ పార్టీ కార్మికులకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సంయుక్త కార్యదర్శి మహిపాల్, బిఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ఇంచార్జి రాకేష్, మాజీ కౌన్సిలర్ మహమ్మద్ అలీ, బిఆర్‌ఎస్ నాయకులు శివన్న, గణేష్, అలీ వహీద్, కనుకుంట శ్రీకాంత్, వడ్డె నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## 50కి బదులు 32 కిలోల రేషన్ బియ్యం

**నాగల్‌గిద్ద, నవంబరు 9, ప్రభాతవార్త:** పేద ప్రజలకు సరఫరా చేసే రేషన్ బియ్యం తూకంలో తక్కువగా నమోదు కావడంతో రేషన్ డీలర్‌తో పాటు వినియోగదారులు కూడా అవాక్కయ్యారు. శనివారం మండల పరిధిలోని కారముంగి గ్రామంలో ప్రజలకు రేషన్ బియ్యం సరఫరా చేసే పౌర సరఫరాల దుకాణంలో కేంద్రానికి దిగుమతి అయిన 50 కిలోల సంచిని తూకంపై ఉంచితే అది 32 కిలోలుగా చూపించింది. ఏకంగా 18 కిలోలు బియ్యం తక్కువగా ఉండటంతో దిగుమతి అయిన బియ్యం సంచుల్లో ఎన్నింటిలో కోత ఉందో అని డీలర్ ఆవేదన వ్యక్తం చేశాడు. సంబంధిత అధికారులు రేషన్ దుకాణానికి సరఫరా అయ్యే బియ్యం తూకంలో తక్కువగా ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బియ్యంసంచి తూకంలో తక్కువగా చూపుతున్న కాంటా

## గురుకుల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు సి.హెచ్.అశోక్

**నారాయణఖేడ్, నవంబర్ 9 ప్రభాతవార్త:** జూకల్ శివారులో గల బిసి గురుకుల పాఠశాలలో రెండురోజులుగా విద్యార్థులు వాంతులు అనారోగ్యాలకు గురవుతున్నా ప్రిన్సిపల్ పట్టించుకోవడం లేదని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు సి.హెచ్.అశోక్ అన్నారు. శనివారం జూకల్ శివారులో గల మహాత్మ జ్యోతిరావు పూలే హాస్టల్‌ను సందర్శించి చూడగా కొంత మంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారని, విద్యార్థులకు అందించే భోజనంలో పురుగులు, తాగేనీరు బాగాలేనందున విద్యార్థులు వాంతులు విరేచనాలతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు. వార్డెన్ సంగీత, ప్రిన్సిపాల్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హాస్టల్లో ఉంటున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి నిఖిల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.